క్లుప్తంగా

జీతాలు ఇప్పించాలని 104 ఉద్యోగుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న 104 ఉద్యోగులు

ఉండి: తమకు రావాల్సిన మూడు నెలల జీతాలు ఇప్పించాలంటూ 104 సిబ్బంది చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా గురువారం మండల తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 ద్వారా ప్రజలకు అందించిన సేవలకు గానూ గత మూడు నెలల్లో మాకు జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉందని అన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలు ఇప్పించాలంటూ కోరారు. కార్యక్రమంలో 104 జిల్లా అధ్యక్షుడు ఆర్‌ఎం విజయ్‌కుమార్, పైలట్ అన్నము నాయుడు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సి.నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సర్వీసులను అందించడంలో ముందుండాలని, అవినీతి ఆరోపణలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ విభాగాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి జీతం తీసుకుని పని చేస్తున్నామని, అవినీతి ఆరోపణలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఏఓ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి స్పందన లోగో వాడాలి

ట్రాన్స్‌ఫార్మర్ మార్పు



మొగల్లులో ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోట ఎత్తులో బిగిస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

పాలకోడేరు: మొగల్లు ఎస్సీ ఏరియా లో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారంటూ సాక్షి దినపత్రికలో 'పొంచి ఉన్న ముప్పు' అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు ఎట్టకేలకు స్పందించారు. గురువారం ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి దినపత్రికను స్థానికులు అభినందించారు.

మైక్రో వాటర్ ఫిల్టర్‌తో సురక్షిత నీరు

గ్రామాల నిధులతో నిర్మాణానికి చర్యలు

ఆకివీడు: సురక్షిత నీటికి మైక్రో వాటర్ ఫిల్టర్లే శరణ్యమని అధికారులు తేల్చేశారు. గోదావరి, కృష్ణా నదులకు మధ్య ఉన్న కొల్లేరు సరస్సు తీరంలోని గ్రామాల్లో చుట్టూ నీరున్నా తాగడానికి చుక్క మంచినీరు దొరకని పరిస్థితి. ఇటీవల కాలంలో రొయ్యలు, చేపల చెరువులు అధికంగా ఉండటంతో పంట కాలువలు కూడా మురుగు కాలువలుగా మారిపోతున్నాయి. పంట కాలువల్లోని నీటిని మంచినీటి చెరువుల్లో నింపి, నీటిని నిల్వ ఉంచిన తరువాత దానిలో ఉన్న వ్యర్థాలు కిందికి దిగిపోతాయి. ఈ నీటిని రక్షిత మంచినీటి ట్యాంకులలోకి ఫిల్టర్ చేసి నింపుతున్నారు. కుళాయిల ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నారు. ఫిల్టర్ విధానంలో కూడా లోపభూయిష్టమైన చర్యలు ఉండటంతో నీటి శుభ్రత అంతంతమాత్రంగానే ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ప్రజలు కుళాయి నీరు త్రాగేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ ఆర్వో, మినరల్, వాటర్ ప్లాంట్‌ల ద్వారా భూగర్భ జలాల్ని శుద్ధి చేసి విక్రయిస్తున్న నీటినే తాగుతున్నారు. ఫలితంగా కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులకు గురవుతున్నారు. మంచినీటిలో లోపాల వల్ల ఇతర రోగాలకు కూడా గురవుతున్నారు.



మండలంలోని పెదకాపవరం గ్రామంలో రక్షిత నీటి పథకాల వద్ద నిర్మించిన మైక్రో వాటర్ ఫిల్టర్స్

సూక్ష్మశుద్ధితో రక్షిత మంచి నీరు

మైక్రో వాటర్ ఫిల్టర్ ద్వారా చెరువుల్లోని నీటిని సూక్ష్మంగా శుద్ధి చేసి ప్రజలకు అందజేయాలనే ఆశయంతో ఫిల్టర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. రెండు డ్రమ్ముల్లో బొగ్గు, మూడు రకాల ఇసుకతో నింపి నీటిని శుద్ధి, పెబుల్స్(గలకరాళ్ళు)నింపుతారు. దీనిలోకి చెరువుల్లోని నీటిని నింపి శుద్ధి చేయనున్నారు. తరువాత ఆలం ట్రీట్‌మెంట్‌తో నీటిని సరఫరా చేస్తారు. రూ.18 లక్షల వ్యయంతో నిర్మించే ఫిల్టర్‌కు 10 లక్షల లీటర్ల నీటిని శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. అదేవిధంగా రూ.12 లక్షల వ్యయంతో నిర్మించే ఫిల్టర్ వ్యవస్థకు 5 లక్షల లీటర్ల నీటిని శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. జల జీవన్ మిషన్ నిధుల ద్వారా నియోజకవర్గంలో ఇప్పటికే 25 గ్రామాల్లో వీటిని నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించి పనులు ప్రారంభించారు. ఇప్పటికే ఆకివీడు మండలంలోని పెదకాపవరం, కోళ్లపర్రు, ఉండి మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం, పాలకోడేరు మండలంలోని పెన్నాడ గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్నాయి.

మంచినీటి సమస్యకు చెక్



కొల్లేరు తీరంలో ఉన్న పెదకాపవరం గ్రామంలో మంచినీటి ట్యాంకు, రక్షిత మంచినీటి పథకాలు అమలులో ఉన్నప్పటికీ ప్రజలకు రక్షిత నీరు సరఫరా చేయలేకపోతున్నాం. మంచినీటి చెరువు వద్ద రక్షిత ట్యాంక సమీపంలో మైక్రో వాటర్ ఫిల్టర్ వ్యవస్థ నిర్మాణం పూర్తయ్యింది. అందువల్ల గ్రామంలో మంచి నీటి సమస్యకు చెక్ పెట్టినట్లయ్యింది. ఎంపీపీ జయలక్ష్మి, ఉపసర్పంచ్ పాతపాటి పద్మావతి శ్రీనివాసరాజు సహకారంతో ప్లాంట్‌ను వేగంగా నిర్మించాం.

ఊసల బేబీ స్నేతు, సర్పంచ్, పెదకాపవరం

పరీక్షలతోనే క్యాన్సర్‌ను జయించాలి



ఆకివీడు: పెదకాపవరంలో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కాళ్ల: క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



భీమవరం అర్బన్: క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: ముందుగా గుర్తించి, తగిన వైద్యం పొందుతుంటే క్యాన్సర్‌ను ఆదిలోనే అంతం చేయవచ్చని మండల పరిషత్ అధ్యక్షులు కఠారి జయలక్ష్మి చెప్పారు. మండలంలోని పెదకాపవరం గ్రామంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహనా ర్యాలీని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి రక్త పరీక్షలు చేయించుకుని క్యాన్సర్‌ను జయించాలని పిలుపునిచ్చారు. నగర పంచాయతీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో క్యాన్సర్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహనా సదస్సు విద్యార్థులతో నిర్వహించారు. డాక్టర్లు భువన, రాజశేఖర్, ప్రిన్సిపాల్ కె.సుజాత పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తో సాధ్యమని కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సారాబు సునీల్ తెలిపారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి వైద్యాధికారి డాక్టర్ సునీల్ మాట్లాడుతూ స్త్రీలకి రొమ్ములో గడ్డలు, నోటి పూత ఎక్కువ రోజులు ఉన్న ముందుగానే గమనించి కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు వచ్చి చికిత్స చేయించుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా నవంబర్ 14 నుంచి వైద్య సిబ్బంది ఇంటి ఇంటి సర్వే నిర్వహించినప్పుడు అనుమానిత లక్షణాలు గల వారు ఎవరైనా సిబ్బందికి తెలియపరిస్తే వారు వెంటనే కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు టి.భావన హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

భీమవరం అర్బన్: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ముందు జాగ్రత్తలు తీసుకుంటే ఈ ప్రాణంతక వ్యాధి నుంచి ఉపసమనం పొందొచ్చని తుందుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారిని జి.దయామణి అన్నారు. తుందుర్రులో గురువారం ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ దయామణి మాట్లాడుతూ క్యాన్సర్ పొగాకు వలన వస్తుందని, పొగాకుకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆరేటి వాసు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరవాసరం: శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెట్ల కొమ్మల తొలగింపు చేపట్టనున్నారు. ఈ పనుల నిమిత్తం 33/11 కేవీ వీరవాసరం సబ్‌స్టేషన్‌లో మండల హెడ్ క్వార్టర్ ఫీడర్ గ్రామాలు వీరవాసరం, వడ్డిగూడెం, తలతాడితిప్ప, నందమూరు గురువు, పెర్కిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్‌శాఖ ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉండిలో

ఉండి: ఉండి మండలం కోలమూరు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)ఎన్ వెంకటేశ్వరరావు గురువారం విలేకరులకు తెలిపారు. దీని కారణంగా పాములపర్రు, కోలమూరు, ఉప్పులూరు, పాందువ్వ, ఆరేడు, కలిగొట్ల గ్రామాల్లో గృహ అవసరాలు, ఆక్వా చెరువులకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం: కొవ్వాడ 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ లైన్ల మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ పనుల నిమిత్తం 8వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రెండో పట్టణంలో పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. శివరావుపేట, జువ్వలపాలెంరోడ్డు, సుబ్బారాయుడుగుడి, చెట్టు క్రింద సాయిబాబా గుడి ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

13న ఉచిత కంటి వైద్య శిబిరం

భీమవరం: పట్టణంలోని ఆర్యవైశ్య వర్తక సంఘం భవనంలో 13వ తేదీ బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేవారు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్సులు తీసుకురావాలని సూచించారు. 10, 11, 12 తేదీల్లో సంఘ భవనం వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మీ పేర్లు నమోదు చేయించుకోవాలని స్పష్టం చేశారు.

జాబ్‌మేళా వాయిదా

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 11న నిర్వహించాల్సిన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా వాయిదా పడినట్లు ఐటీఐ ప్రిన్సిపల్ వీ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ కారణంగా వాయిదా వేశామని తెలిపారు. తదుపరి తేదీని త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు విద్యార్థుల విరాళం

భీమవరం (ప్రకాశంచౌక్): సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఉండి మండలం మహాదేవపట్నం హైస్కూల్ విద్యార్థులు విరాళం అందజేశారు. గురువారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టరు చదలవాడ నాగరాణిని కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చేతుల మీదుగా రూ.32,180 చెక్కును విజయవాడ వరద బాధితుల సహాయ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

భీమవరం: నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరగనున్న 68వ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు భీమవరం బ్రౌనింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రంపా ఎలిషా తెలిపారు. అండర్-19 బాలికల విభాగంలో ఎస్. ప్రవీణ, జి.లిఖిత, కె.బాలజ్యోతి, ఎస్.వర్షిత లక్ష్మీ భద్ర, ఎస్.నీలిమ, అండర్-19 బాలుర విభాగంలో ఎస్.మణికంఠ, పి.దుర్గా గణేష్, ఎస్.సుందర్ సింగ్, ఎల్.దినేష్, డి.ఉదయ్ శంకర్ ఎంపికయ్యారన్నారు. వీరితోపాటు అండర్-17 బాలికల విభాగంలో సీహెచ్ కాంచన ఎంపికయ్యారని తెలిపారు. పోటీలు ఈ నెల 10 నుంచి 12 వరకు జరగనున్నాయని కోచ్ పి.దావుద్ తెలిపారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పవిత్రోత్సవాలు ప్రారంభం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక జువ్వలపాలెం రోడ్డులోని శ్రీ దంతులూరి జగన్నాథరాజు కోపల్లె వారి సత్రం అనుబంధ సంస్థ శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం నుంచి పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, యాగాలు నిర్వహించనునున్నారు. మొదటి రోజు గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వామి వారి పవిత్రోత్సవాల్లో పాల్గొన్నారు. కలెక్టర్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో వంశపరంపార్య ధర్మకర్త ,దేవస్థాన చైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు, ఆలయ కార్యనిర్వహణ అధికారి ముదునూరి సత్యనారాయణరాజు, అర్చకులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద చార్యులు, ప్రధాన అర్చకులు వాడపల్లి ఆదినారాయణ చార్యులు, చెరుకవాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ నాగరాణి

నామినేటెడ్ పదవుల్లో దేవాంగులకు అన్యాయం

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల పంపిణీలో దేవాంగులకు అన్యాయం చేశారని సంఘ గౌరవ అధ్యక్షుడు వి.గణేష్ అన్నారు. గురువారం స్థానిక వీవర్స్ కమ్యూనిటీ హాలు నందు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత జనాభాలో సుమారు 16 లక్షలు పైబడి దేవాంగులు ఉన్నారన్నారు. కేవలం ఒకే ఒక చేనేత వర్గానికి చెందిన వారికి పదవి ఇచ్చి మిగిలిన వారికి అన్యాయం చేశారన్నారు. గతంలో చేసినట్లు దేవాంగ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అలాగే ఎమ్మెల్సీ, ముఖ్యమైన దేవస్థానాలతో పాటు ఇతర నామినేటెడ్ పదవులు జనాభా ప్రాతిపదికన సముచిత స్థానం కల్పించే విధంగా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కూర్మా శివగణేష్, సెక్రటరీ మానెం బసవరాజు, బాసిన సత్యనారాయణ, యర్రా శివాజీ, బాసిన గుణేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్చరీలో విద్యార్థుల ప్రతిభ

భీమవరం: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పార్వతీపురం నందు 3, 5 తేదీల్లో నిర్వహించిన ఏపీఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ టోర్నమెంట్‌లో భీమవరం తిరుమల కళాశాల విద్యార్థులు సత్తా చాటారని డైరెక్టర్లు ఎస్. సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ తెలిపారు. అండర్-19 కాంపౌండ్ గర్ల్స్ విభాగంలో కె.శరణ్య బంగారు పతకం, ఆర్.రూపచంద్ర హాసిని వెండి పతకం సాధించారన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ విజయాలు సాధించాలని అన్నారు. గుజరాత్ రాష్ట్రంలో 15, 16 తేదీల్లో జరగబోయే నేషనల్ లెవెల్ ఆర్చరీ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సోషల్ మీడియా కన్వీనర్ జయరాం ఆచూకీపై ఆరా

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ భోగం జయరాంను భీమవరం వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని గత ఐదు రోజులుగా విచారణ పేరట రహస్యంగా ఉంచడం దారుణమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. రాత్రులు కూడా అతడిని ఇంటికి పంపించకపోవడంతో జయరాం కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన చెంది, బుధ, గురువారాల్లో పోలీసు స్టేషన్ వద్ద పడిగాపులు కాశారు. జయరాం అచూకీ చెప్పాలని పార్టీ నాయకులు సీఐ నాగరాజును అడిగితే విచారణ జరుగుతుందని పంపిస్తామని మాట దాట వేశారని నాయకులు చెబుతున్నారు. బెయిల్ ఇవ్వదగని కేసుల్లో ముద్దాయిలను 41-ఏ నోటిసు ఇచ్చి వెంటనే పంపించాలని ఉన్నప్పటికీ పోలీసులు చట్టానికి వ్యతిరేకంగా జయరాంను నిర్బంధించడం అన్యాయమని పార్టీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాయప్రోలు శ్రీనివాస్‌మూర్తి, కామన నాగేశ్వరరావు, కోడే యుగంధర్, గంటా సుందర్ కుమార్, పాలివేలి మంగ, కోడే విజయలక్ష్మి, బడుగు అశోక్, చిగురుపాటి రాజు, పత్తివాడ రాజేందర్, పెచ్చేటి ప్రసాద్, పరువు విజయకుమార్, పెనుమాల రిచి, మాదిరెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వన్‌టౌన్ సీఐతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెట్రోల్ బంకులో తనిఖీలు

ఉండి: వినియోగదారులకు కచ్చితమైన తూకంతో పెట్రోల్,డీజీల్ అందించాలని పెట్రోల్ బంక్ యజమానులకు తూనికలు, కొలతలు శాఖ కోనసీమ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ కె.రాజేష్ సూచించారు. గురువారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ఓ ప్రైవేటు బంక్‌లో తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జంబ్లింగ్ విధానంలో కోనసీమకు చెందిన తామంతా ఉండి,ఆకివీడు, భీమవరం ప్రాంతాల్లోని పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తూనికలు కొలతలు శాఖ భీమవరం ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పెట్రోల్ బంక్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వీఓఏ కాలపరిమితి జీఓ రద్దు చేయాలి


నరసాపురం రూరల్: ఇందిరా క్రాంతి పథంలో పని చేస్తున్న వీఓఏ కాలపరిమితి జీఓను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐకేపీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ డ్వాక్రా గ్రామ సంఘాల నిర్వహణ సహాయకులకు ప్రభుత్వం కాలపరిమితి జీఓను విడుదల చేసిందని ఈ జీఓ వారి పని విధానాలకు తీవ్ర ఆటంకం కలిగిస్తుందన్నారు. వీరికి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు అనంతరం వినతి పత్రాన్ని ఏపీఎం ప్రభుదాస్‌కు అందించారు.

వృద్ధాశ్రమానికి రూ.6 లక్షల విరాళం

భీమవరం: చిన అమిరం లోని శ్రీస్వామి యోగీశ్వరానందగిరి విశ్వశాంతి వృద్ధుల ఆశ్రమానికి పొత్తూరి వెంకట రామరాజు దంపతులు రూ.6 లక్షలు విరాళాన్ని గురువారం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు చేతులమీదుగా ఆశ్రమ నిర్వాహకులకు ఈ మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో ఆశ్రమం గౌరవాధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణ రాజు, గొట్టుముక్కల జయహరిరాజు, మంతెన వేంకటేశ్వర రాజు, పొత్తూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

దుంపగడప మాజీ సర్పంచ్ రామకృష్ణ మృతి

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కవిటపు రామకృష్ణ(48) గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన గత రెండు రోజులుగా ఆస్తమాతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామకృష్ణ మృతిపై పట్ల సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొట్టు మాణిక్యాలరావు, ఆంజనేయులు, అట్లూరి సంజయ్, కోయ అయ్యన్న, తవిటినాయుడు, కుర్రెళ్ల పోలు తదితరులు సంతాపం ప్రకటించారు.



కవిటపు రామకృష్ణ (ఫైల్)

చంపుతానని బెదిరించిన వ్యక్తులపై కేసు

నరసాపురం రూరల్: బాకీ చెల్లించాలని లేకుంటే చంపుతామని బెదిరించడంతో ఓ వ్యక్తి ఫిర్యాదు చేసిన సంఘటన గురువారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి మొగల్తూరు ఎస్సై జి.వాసు తెలిపిన వివరాల ప్రకారం కోమటితిప్ప గ్రామానికి చెందిన మేకల వెంకటేశ్వరరావు రామన్న పాలేనికి చెందిన వ్యక్తికి బాకీ ఉన్నాడని ఆ బాకీ తీర్చాలని లేకుంటే చంపుతామని గట్టెం ముత్యాలరావు, మరో ఐదుగురు వ్యక్తులు బెదిరించారు. అంతేకాకుండా తన ఇంటికి వచ్చి దౌర్జన్యానికి దిగాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.